- భద్రాచలం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన 'తెల్లం'
- 5,719 ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి పొదెంపై విజయం

# తేట 'తెల్లం'గా విజయతీరం



ఎన్నికల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావును గులాబీ శ్రేణుల శుభాకాంక్షలు



తెల్లం వెంకట్రావుకు స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు



కార్యకర్తలు, అభిమానులకు తెల్లం వెంకట్రావు కరచాలనం

భద్రాచలం, డిసెంబర్ 3: భద్రాచలానికి చెందిన డాక్టర్ తెల్లం వెంకట్రావు మూడో పర్యాయంలో ఎమ్మెల్యేగా గెలుపొందారు. భద్రాచలం నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన.. కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్యపై 5,719 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. 2014లో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన.. వైఎస్ఆర్‌సీపీ తరపున మహబూబాబాద్ ఎంపీగా పోటీచేసి ఓడిపోయారు. అనంతరం 2018లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేశారు. అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య చేతిలో సుమారు 10 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. మళ్లీ 2023లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించారు. అయితే, గత రెండు పర్యాయాలు కూడా బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్కొక్క సీటును మాత్రమే గెలుస్తూ వచ్చింది. 2014 ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి జలగం వెంకట్రావు, 2018 ఎన్నికల్లో ఖమ్మం నుంచి పువ్వాడ అజయ్‌కుమార్ మాత్రమే బీఆర్ఎస్ తరపున విజయం సాధించారు. అదే ఆనవాయితీ ఈసారి కూడా కొనసాగింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆశీస్సులతో భద్రాచలం నియోజకవర్గం నుంచి బరిలో దిగిన డాక్టర్ తెల్లం వెంకట్రావు.. ఈ ఎన్నికల్లో గెలుపొందారు. పాల్వంచలోని అనుబోస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో మొదటి ఆరు రౌండ్లలో కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య ఆధిక్యంలో ఉన్నారు. 7వ రౌండ్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు అనూహ్యంగా ముందంజలోకి వచ్చారు. 13వ రౌండ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావుకు 52,612 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్యకు 46,243 ఓట్లు వచ్చాయి. 5,719 ఓట్ల మెజారిటీ సాధించారు.

### 'తెల్లం'కు అడుగడుగునా జన నీరాజనం

బీఆర్ఎస్ భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆదివారం పాల్వంచలోని అనుబోస్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన అసెంబ్లీ ఓట్ల లెక్కింపులో ఆయన సమీప కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొదెం వీరయ్యపై మంచి మెజారిటీతో గెలుపొందారు. ఫలితాలు వెలువడిన తర్వాత ఆయన పార్టీ భద్రాచలం ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తో కలిసి భద్రాచలం పట్టణానికి చేరుకున్నారు. వారికి బ్రిడ్జి సెంటర్ వద్ద వేలాది మంది గులాబీ శ్రేణులు, ప్రజలు స్వాగతం పలికారు. మహిళా నాయకులు హారతులిచ్చారు. అనంతరం తెల్లం, మధు రామాలయానికి చేరుకొని రామయ్యను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి వేదాశీర్వచనం, స్వామివారి శేష వస్త్రాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. వారి వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అరికెళ్ల తిరుపతిరావు, కొండిశెట్టి కృష్ణమూర్తి, నాయకులు తాండ్ర వెంకట రమణారావు, తాళ్లపల్లి రమేశ్ గౌడ్, చుక్కా సుధాకర్, నర్రా రాము, దారపునేని రాంబాబు, గంగాభారతి, కేతినేని లలిత, ఒగ్గు అనురాధ, మానె కమల పాల్గొన్నారు.

## 'అనుబోస్'లో పోలింగ్ సరళి ఇలా..



పోస్టల్ బ్యాలెట్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): పాల్వంచ అనుబోస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. నిన్న మొన్నటి వరకు ప్రచారంలో 'నువ్వా..నేనా..?' అని సవాల్ విసురుకున్న ఎమ్మెల్యే అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రంలో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఒకరి పక్కనే ఒకరు కూర్చొని కౌంటింగ్ సరళిని పరిశీలించారు. ఇక ఓడిపోతాం అని భావించిన అభ్యర్థులు కౌంటింగ్ సెంటర్ నుంచి బయటకు వెళ్లిపోయారు. గెలుపొందిన అభ్యర్థులు బయటకు వెళ్లి కార్యకర్తలు, అభిమానులతో కలిసి పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. కేంద్రంలో కౌంటింగ్ ప్రక్రియను కలెక్టర్ ప్రియాంక ఆల పరిశీలించారు. మీడియా సెంటర్‌లో డీపీఆర్వో శ్రీనివాసరావు మీడియాకు అవసరమైన సమాచారాన్ని అందించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా భద్రాద్రి ఎస్పీ వినీత్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

- ఉమ్మడి జిల్లా పరిధిలోని పదింటిలో ఎనిమిది స్థానాలు 'హస్త'గతం
- కొత్తగూడెంలోనూ ఆ పార్టీ బలపరిచిన అభ్యర్థి 'కూనంనేని'దే విక్టరీ
- ఒక్క భద్రాచలంలోనే బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం గెలుపు

# కాంగ్రెస్ విజయం



అధికారుల నుంచి ధ్రువపత్రాలు అందుకుంటున్న విజేతలు తెల్లం, భట్టి, తుమ్మల, పొంగులేటి, కోరం



ధ్రువపత్రాలు అందుకుంటున్న విజేతలు రాగమయి, పాయం, జారె, రాందాస్‌నాయక్, కూనంనేని

ఖమ్మం, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని పది నియోజకవర్గాల పరిధిలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎనిమిది స్థానాల్లో విజయం సాధించింది. కొత్తగూడెం నుంచి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు గెలిచారు. భద్రాచలం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు గెలుపొందారు. మిగిలిన ఎన్నిమిది స్థానాల్లోనూ కాంగ్రెస్ పార్టీదే విజయం. ఖమ్మం జిల్లా పరిధిలోని ఐదు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు రూరల్ మండల పరిధిలోని శ్రీచైతన్య కళాశాలలో జరిగింది. భద్రాద్రి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల లెక్కింపు పాల్వంచలోని అనుబోస్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాయంత్రం వరకు కొనసాగింది. తొలుత సిబ్బంది పోస్టల్ బ్యాలెట్లను లెక్కించారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపులో బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు ఆధిక్యత లభించింది. సాధారణ ఓట్ల లెక్కింపులో ఒక్క రౌండ్ మినహా దాదాపు అన్ని రౌండ్లలోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు ఆధిక్యత కొనసాగింది.

### ఖమ్మం జిల్లా పరిధిలో గెలుపోటములు ఇలా..

ఖమ్మం నియోజకవర్గంలో మొత్తం 23 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు తన సమీప బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్‌పై 49,381 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. పాలేరు నియోజకవర్గంలో 20 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తన సమీప బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డిపై 56,478 ఓట్ల మెజారిటీతో గెలిచారు. మధిరలో 19 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క తన సమీప బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజుపై 35,452 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. వైరా నియోజకవర్గంలో 18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాలోతు రాందాస్ నాయక్ తన సమీప బీఆర్ఎస్ అభ్యర్థి బానోతు మదన్‌లాల్‌పై 33,045 ఓట్ల మెజారిటీతో విజయాన్ని కైవసం చేసుకున్నారు. సత్తుపల్లిలో 20 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మట్టా రాగమయి తన సమీప బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకట వీరయ్యపై 19,463 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

### భద్రాద్రి జిల్లాలో ఇలా..

భద్రాచలంలో 12 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు తన సమీప కాంగ్రెస్ పార్టీ పొదెం వీరయ్యపై 5,719 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఇల్లెందు నియోజకవర్గంలో 17 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోరం కనకయ్య తన సమీప బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు హరిప్రియానాయక్‌పై 57,309 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కొత్తగూడెం నియోజకవర్గంలో 18 రౌండ్ల ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి కూనంనేని సాంబశివరావు తన సమీప ఆల్ ఇండియా ఫార్వాడ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి జలగం వెంకటరావుపై 26,547 ఓట్ల మెజారిటీతో విజయాన్ని కైవసం చేసుకున్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో 13 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జారె ఆదినారాయణ తన సమీప బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావుపై 28,905 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. పినపాక నియోజకవర్గంలో 18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు తన సమీప బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావుపై 34,506 ఓట్ల మెజార్టీతో గెలిచారు.

### టాప్ మెజారిటీ సాధించిన వారు.. మొదటి సారి అసెంబ్లీలో అడుగుపెట్టే వారు వీరే..

ఉమ్మడి జిల్లా పరిధిలోని పాలేరు నుంచి గెలిచిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అత్యధిక మెజారిటీ ఓట్లతో గెలుపొందిన వారిలో మొదటివారు, ఇల్లెందు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోరం కనకయ్య రెండోవారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు 3వ స్థానంలో నిలిచారు. తొలిసారిగా ఎమ్మెల్యేలుగా అసెంబ్లీలో అడుగు పెట్టే వారిలో వైరా నుంచి మాలోతు రాందాస్ నాయక్, సత్తుపల్లి నుంచి మట్టా రాగమయి, అశ్వారావుపేట నుంచి జారె ఆదినారాయణ, భద్రాచలం నుంచి తెల్లం వెంకట్రావు, పాలేరు నుంచి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అడుగు పెట్టనున్నారు. ఎన్నికల్లో ఖమ్మం నుంచి గెలిచిన అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు వయస్సులో పెద్దవారు కాగా అశ్వారావుపేట నుంచి గెలిచిన జారె ఆదినారాయణ పిన్న వయస్కులు. గెలుపొందిన అభ్యర్థులు ఆయా రిటర్నింగ్ అధికారుల నుంచి ఎమ్మెల్యేలుగా ధ్రువపత్రాలను అందుకున్నారు.

### ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం తీరుస్తుంది:భట్టి, పొంగులేటి

ఓట్ల లెక్కింపు అనంతరం గెలిచిన మధిర, పాలేరు అభ్యర్థులు మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మంచి మెజారిటీ ఇచ్చి గెలిపించారని, వారి ఆకాంక్షలు నెరవేర్చే విధంగా పార్టీ పనిచేస్తుందన్నారు. అన్నివర్గాల ప్రజల కష్టాలను తీర్చే విధంగా కృషి చేస్తామన్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారెంటీ స్కీములను అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. సీఎం ఎవరవుతారనే అంశాన్ని పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందన్నారు.



ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శిస్తున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్, సీపీ విష్ణు



పాల్వంచలో సీసీ కెమెరా లైవ్ పుటేజీ పరిశీలన

# అనుక్షణం.. ఉత్కంఠ

- పది నియోజకవర్గాల పరిధిలో తేలిన 'ప్రజాతీర్పు'
- రెండు చోట్లా ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు
- లెక్కింపు ప్రక్రియను ఆసక్తిగా గమనించిన అభ్యర్థులు
- కొందరు ఓటమిని ముందే అంచనా వేసి బయటకు..
- కేంద్రాలను పరిశీలించిన ఉభయ జిల్లాల కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక
- ఎక్కడా అవాంఛిత ఘటనలకు తావు లేకుండా పోలీస్ బందోబస్తు

ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల కళ్లలో టెన్షన్.. టెన్షన్.. ఎక్కడా చూసినా హడావుడి.. కేంద్రం బయట వివిధ పార్టీలకు చెందిన శ్రేణుల ఎదురుచూపులు.. ఏ పార్టీ గెలుస్తుంది.. ఎవరు గెలుస్తారు.. ఎవరు ఓటమి పాలవుతారనే ఉత్కంఠ మధ్య ఆదివారం ఖమ్మం జిల్లా రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల, భద్రాద్రి జిల్లా పాల్వంచ పట్టణంలోని అనుబోస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఉమ్మడి జిల్లా పరిధిలోని ఐదు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగింది. నిన్నమొన్నటి వరకు 'నేను గెలుస్తాను అంటే.. నేను గెలుస్తాను..' అని, 'గెలిచేది నువ్వా? నేనా..?' అని సవాల్ విసుకురుకున్న ఎమ్మెల్యే అభ్యర్థులు ఓట్ల లెక్కింపు కేంద్రంలో పలకరించుకున్నారు. పక్కపక్కనే కూర్చొని లెక్కింపు సరళిని పరిశీలించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం వరకు సాగింది. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రక్రియ మొదట షురూ అయింది. కేంద్రాలను ఉభయ జిల్లాల కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక, ఖమ్మం సీపీ విష్ణు, భద్రాద్రి ఎస్పీ వినీత్ గంగన్న పరిశీలించారు. - నమస్తే నెట్‌వర్క్



స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన ఈవీఎంలు..




పొన్నెకల్‌లో ఈవీఎంలు తీసుకొస్తున్న సిబ్బంది



ఖమ్మం రూరల్‌లో..



ఖమ్మం రూరల్ పరిధిలో..





ఖమ్మంలో లెక్కింపు ప్రక్రియ



పాల్వంచలో..



పాల్వంచలో పోలీసుల బందోబస్తు



పాల్వంచలో లెక్కింపు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏజెంట్లు



పాల్వంచలో..